సాక్షి ఆదిలాబాద్

శనివారం । 7 । సెప్టెంబర్ । 2024

ప్రతిష్ఠాపనకు తరలుతున్న భారీ వినాయకుడు



రావయ్య.. గణపయ్య

- నేడే వినాయక చవితి

గణనాథుని ఆగమనానికి సర్వం సిద్ధమైంది. వాడవాడనా లంబోధరున్ని కొలువు తీర్చేందుకు భక్తులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వినాయక చవితి పురస్కరించుకొని శనివారం ఏకదంతున్ని ప్రతిష్ఠించేందుకు ఆయా మండపాలను ఇప్పటికే సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. వివిధ రూపాల్లోని బొజ్జగణపయ్య ప్రతిమలను జిల్లా కేంద్రం నుంచి గ్రామీణ ప్రాంతాలకు శుక్రవారమే తరలించారు. మరోవైపు పండుగ నేపథ్యంలో మార్కెట్లో పూజా సామగ్రి కొనుగోళ్లతో సందడి నెలకొంది. - ఆదిలాబాద్



పూజా సామగ్రి కొనుగోలు చేస్తున్న జనం



ఆటోలోనే గణేశుని విగ్రహానికి తుది మెరుగులు దిద్దుతున్న కళాకారుడు

న్యూస్‌రీల్

జిల్లాస్థాయి కబడ్డీ ఎంపిక పోటీలు



క్రీడాకారులను పరిచయం చేసుకుంటూ..

ఆదిలాబాద్‌రూరల్: జిల్లాస్థాయి అండర్–14 బాలికల కబడ్డీ ఎంపిక పోటీలను మండలంలోని పాచ్చర జెడ్పీఉన్నత పాఠశాలలో శుక్రవారం నిర్వహించారు. జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలను ఆర్గనైజింగ్ కార్యదర్శి కాంతారావుతో కలిసి పాఠశాల ఇన్‌చార్జి హెచ్‌ఎం సంగీత ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడా స్ఫూర్తి ప్రదర్శించాలన్నారు. ఇందులో పెటా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ స్వామి, వ్యాయామ ఉపాధ్యాయులు నాందేవ్, రేణుక, జ్యోతి, గోపాల్, తదితరులు పాల్గొన్నారు.

'ఫసల్ బీమా' అమలు చేయాలి

ఆదిలాబాద్‌టౌన్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం ఫసల్ బీమా పథకాన్ని అమలు చేసి పరిహారం అందించాలని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షుడు సంగెపు బొర్రన్న ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని భీంపూర్, జైనథ్, బేల మండలాల్లోని వివిధ గ్రామాల రైతులు పంట నష్టపోయారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం 2016లో ప్రవేశపెట్టిన ఫసల్ బీయా యోజన పథకాన్ని గత ప్రభుత్వం 2023 వరకు అమలు చేయలేకపోయిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ పథకాన్ని ఖరీఫ్ సీజన్‌లో అమలు చేస్తామని హామీ ఇచ్చిందని, వెంటనే అమలు చేసి రైతులను ఆదుకోవాలని కోరారు.

బోథ్ పీఏసీఎస్ చైర్మన్‌పై వేటు

- సమావేశాలు నిర్వహించలేదని డైరెక్టర్ల ఫిర్యాదు
- విచారణ చేపట్టిన అసిస్టెంట్ రిజిస్ట్రార్
- పదవి నుంచి తొలగిస్తూ డీసీవో ఉత్తర్వులు



కదం ప్రశాంత్

బోథ్: బోథ్ ప్రాథమిక సహకార సంఘ చైర్మన్‌గా ఉన్న కదం ప్రశాంత్‌ను పదవి నుంచి తొలగిస్తూ జిల్లా సహకార శాఖ అధికారి మోహన్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన స్థానంలో ప్రస్తుత వైస్‌చైర్మన్ కోల రాజేశ్వర్‌కు బాధ్యతలు అప్పగించారు. నిబంధనల ప్రకారం ప్రాథమిక సహకార సంఘం చైర్మన్ ఏడాదిలో ప్రతీ మూడు నెలలకోసారి మేనేజింగ్ కమిటీ సమావేశం, ప్రతి రెండు నెలలకోసారి సాధారణ మహాజన సభ నిర్వహించాలి. అయితే గడిచిన ఏడాదిలో బోథ్ ప్రాథమిక సహకార సంఘంలో ఎలాంటి సమావేశాలు నిర్వహించలేదని, కాంగ్రెస్ పార్టీకి చెందిన పీఏసీఎస్ డైరెక్టర్లు గొర్ల రాజుయాదవ్, చట్ల ఉమేశ్, లోలపు పోశెట్టి, ద్యాగాల నారాయణ గత ఆగస్టు 17న జిల్లా సహకార శాఖ అధికారికి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అసిస్టెంట్ రిజిస్ట్రార్ అరుణ పీఏసీఎస్ కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఆ నివేదిక ఆధారంగా చైర్మన్ ప్రశాంత్‌ను పదవి నుంచి తొలగిస్తున్నట్లు డీసీవో ఉత్తర్వులు జారీ చేశారు. ఈ విషయమై కోర్టుకు వెళ్లనున్నట్లు ప్రశాంత్ తెలిపారు.

ఇక్కడ.. ప్రత్యేకం

ఆదిలాబాద్: జిల్లాలో ఏటా వినాయక చవితి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా పలుచోట్ల ప్రత్యేకంగా నిలుస్తూ ఆకర్షిస్తున్నాయి.

మహా వినాయకుడు @ 52

పట్టణంలోని కుమార్‌పేట్‌లో గల కుమార్ జనత గణేశ్‌మండలి ఆధ్వర్యంలో ఏటా మహా గణపతిని ప్రతిష్టిస్తున్నారు. 1979 నుంచి ఇక్కడ నవరాత్రి వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. ఖైరతాబాద్ గణేశుడిని స్ఫూర్తిగా తీసుకొని 2018లో 47 అడుగుల భారీ లక్ష్మి గణపతిని ప్రతిష్ఠించారు. 2022లో 33 అడుగుల మహాశక్తి వినాయకుడిని కొలువు తీర్చారు. గత ఏడాది 48 అడుగుల విగ్రహాన్ని పెట్టగా.. ఈ సారి 52 అడుగుల త్రిముఖ గణపతి విగ్రహాన్ని ప్రతిష్టిస్తున్నట్లు మండలి నిర్వాహకుడు తోట పరమేశ్వర్ తెలిపారు.



మండపంలో సిద్ధమైన త్రిముఖ గణపతి

నిత్య పూజలందుకునే కర్ర గణేశుడు..

జిల్లా కేంద్రంలోని శ్రీరామచంద్ర గోపాలకృష్ణ మఠంలో కొలువు దీరిన కర్ర వినాయక స్వామి ప్రత్యేకంగా నిలుస్తున్నాడు. ఆలయంలో ఐదేళ్ల క్రితం ఈ కర్ర గణనాథుడిని ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి విఘ్నేశ్వరుడు నిత్య పూజలు అందుకుంటున్నాడు. ఏటా వినాయక చవితి పురస్కరించుకొని పునఃప్రతిష్టిస్తారు.



పూజలు అందుకోవడానికి సిద్ధమైన కర్ర గణపయ్య

డీసీసీ పగ్గాలు ఎవరికో..?

- టీపీసీసీ అధ్యక్షుడి ఖరారు నేపథ్యంలో మళ్లీ తెరపైకి
- రేవంత్‌రెడ్డి వర్గంలో హర్షం
- జిల్లా అధ్యక్ష పదవి కోసం పలువురి యత్నాలు

సాక్షి,ఆదిలాబాద్: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడిగా బి.మహేశ్‌కుమార్ గౌడ్ నియామకంతో జిల్లాలో సీఎం రేవంత్‌రెడ్డి వర్గంలో హర్షం వ్యక్తమవుతుంది. ఇక డీసీసీ అధ్యక్ష పదవి ఆశిస్తున్న నేతలు తమ ప్రయత్నాలకు మళ్లీ పదను పెట్టారు. పార్లమెంట్ ఎన్నికల ముందు రాష్ట్రంలో ఖాళీగా ఉన్న డీసీసీ అధ్యక్ష పదవులను అధిష్టానం భర్తీ చేస్తుందని పలువురు ఆశ పెట్టుకొని హైదరాబాద్ స్థాయిలో రాష్ట్ర ఇన్‌చార్జి, ముఖ్య నేతలను కలుస్తూ తమ ఆసక్తిని కనబర్చారు. అయితే అప్పట్లో వాటి నియామకం విషయంలో ముందడుగు పడలేదు. తాజాగా పీసీసీ అధ్యక్షుడి నియామకం నేపథ్యంలో ఈ అంశం మరోసారి తెరపైకి వచ్చింది.



పలువురు ఆశావహులు..

టీపీసీసీ విషయంలో స్పష్టత రావడంతో ఇక డీసీసీ అధ్యక్ష పీఠంపై ఆశలు పెట్టుకున్న వారు తిరిగి తమ ప్రయత్నాలు మొదలుపెట్టారు. ప్రధానంగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాసరెడ్డి, తలమడుగు మాజీ జెడ్పీటీసీ గోక గణేశ్ రెడ్డి, కిసాన్ మోర్చా నాయకుడు బోరంచు శ్రీకాంత్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు అడ్డి భోజారెడ్డి ఈ పదవిని ఆశిస్తున్నట్లు పార్టీలో ప్రచారం సాగుగుతుంది. వీరంతా రేవంత్ రెడ్డి వర్గంగానే కొనసాగుతున్నారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు అనుచరులు నియోజకవర్గాల్లో ఉన్నప్పటికీ ప్రస్తుతం కొంత సైలెంట్ అయ్యారు.

స్థానిక సంస్థల ఎన్నికలకు ముందు..

స్థానిక సంస్థల ఎన్నికలు ముందుండగా, ప్రస్తుతం డీసీసీ అధ్యక్ష నియామకంపై పార్టీలో ఆసక్తి కనిపిస్తోంది. ఈ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక పరంగా డీసీసీ ముద్ర ఉండే అవకాశం ఉండడంతో పార్టీలో ఇప్పుడు అందరు అటువైపే గమనిస్తున్నారు. జిల్లా ముఖ్య నాయకులంతా నూతన అధ్యక్షుడిని కలిసేందుకు తరలివెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. అలాగే రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జితో పాటు కీలక నేతలను కలిసి తమ పదవి కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

ఫీవర్ సర్వే పకడ్బందీగా చేపట్టాలి

- కలెక్టర్ రాజర్షిషా

కైలాస్‌నగర్: జిల్లాలో ఫీవర్ సర్వే పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. కలెక్టర్ సమావేశ మందిరంలో ఆర్‌బీఎస్‌కే బృందాలు, సాంఘిక సంక్షేమ అధికారులతో శుక్రవారం సాయంత్రం సమీక్ష నిర్వహించారు. ఆయా గిరిజన, ఎస్సీ, బీసీ, మైనార్టీ సంక్షేమ పాఠశాలల్లో ఆర్‌బీఎస్‌కే బృందాలు నిర్వహిస్తున్న ఫీవర్ సర్వేపై ఆరా తీశారు. జ్వరాలు, డెంగీ తదితర కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు 162 పాఠశాలలు, వసతిగృహాలకు గాను 141 పూర్తయ్యాయని వైద్య సిబ్బంది పేర్కొన్నారు. మొత్తం 25,671 మంది విద్యార్థులను పరీక్షించగా 885 మంది జ్వరపీడితులుగా గుర్తించినట్లు తెలిపారు. అలాగే ఒక డెంగీ పాజిటివ్ నిర్ధారణ అయినట్లు పేర్కొన్నారు. టీజీఎస్‌డబ్ల్యూఆర్‌ఎస్‌జేసీ ఆదిలాబాద్, బోథ్, ఇచ్చోడ పాఠశాలల్లో భవనాలకు సంబంధించి ఎక్కడెక్కడా మరమ్మతులు అవసరమనే వాటిని గుర్తించి నివేదిక సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో డీఎంహెచ్‌వో కృష్ణ, ఆర్‌బీఎస్‌కే బృందాలు, డీఐవో, పీవో, డీఎంవో, సాంఘిక సంక్షేమ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

సమన్వయంతో పని చేయాలి

గణేశ్ నవరాత్రోత్సవాలు శాంతియుత వాతావరణంలో నిర్వహించేలా సమన్వయంతో వ్యవహరించాలని కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. శుక్రవారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా జిల్లా అధికారులతో మాట్లాడారు. విగ్రహాల ప్రతిష్ట నుంచి నిమజ్జనం వరకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారం చేసేవారిపై నిఘా పెంచాలన్నారు. ఎప్పటికప్పుడు అప్రమత్తతతో వ్యవహరించాలన్నారు. అన్ని మండపాల వద్ద హెల్ప్‌లైన్ టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. నవరాత్రి ఉత్సవాలతో పాటు మిలాద్ ఉన్ నబి వేడుకలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ప్రజలకు సూచించారు. ఇందులో ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవోలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లోకి తీసుకోవాలి

- కలెక్టర్ రాజర్షిషాకు పార్ట్‌టైం లెక్చరర్ల వినతి

కైలాస్‌నగర్: ముందస్తు సమాచారం లేకుండా తమను విధుల నుంచి తొలగించడం సరికాదని సాంఘిక సంక్షేమ డిగ్రీ కళాశాలల పార్ట్‌టైం లెక్చరర్లు పేర్కొన్నారు. తమను విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ కలెక్టర్ రాజర్షిషాను శుక్రవారం కలెక్టరేట్‌లో కలిసి వినతి పత్రం అందజేశారు. అలాగే తమకు రెండు నెలలుగా వేతనాలు కూడా చెల్లించలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ విషయమై తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ కామర్స్ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న లెక్చరర్ పోస్టులను గెస్ట్ ఫ్యాకల్టీ ద్వారా భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ అతీఖ్ బేగం ప్రకటనలో తెలిపారు. ఆంగ్లం–1, ఎకనామిక్స్ ఉర్దూ–1 ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి గల వారు ఈనెల 9లోగా కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 10న సైన్స్ డిగ్రీ కళాశాలలో ఇంటర్వ్యూ ఉంటుందని పేర్కొన్నారు.

ఉపాధ్యాయ వృత్తి గౌరవప్రదమైనది



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

- ఎమ్మెల్యే పాయల్ శంకర్

ఆదిలాబాద్: ఉపాధ్యాయ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ట్రస్మా ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. పలువురు ఉత్తమ ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలు అందజేసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రైవేటు ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో డీఈవో ప్రణీత, ఎంఈవో సోమయ్య, సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సాదుల మధుసూదన్, రాఘవేంద్ర రెడ్డి, రంగినేని పవన్ రావు, వకులాభరణం ఆదినాథ్, దేవేందర్, పురుషోత్తమ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

- కలెక్టర్ రాజర్షిషా

ఇంద్రవెల్లి: అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారం అందించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మండలంలోని మర్కగూడ, గిన్నెర గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆయన సందర్శించారు. రికార్డులను పరిశీలించారు. అనంతరం పిల్లలకు స్వయంగా భోజనం వడ్డించారు. గిన్నెర గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో బాలామృతంతో చేసిన లడ్డులను చిన్నారులకు అందించారు. అనంతరం పాటగూడ, లాల్‌టెకిడి గ్రామాల్లోనూ పర్యటించారు. వరద కోతకు గురైన కల్వర్టులు, బీటీ రోడ్లతో పాటు పంట నష్టంను పరిశీలించారు. తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఇందులో డీఆర్డీవో సాయన్న, తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్, ఎంపీడీవో భాస్కర్, డిప్యూటీ తహసీల్దార్ రమేశ్, డీఈ రమేశ్, ఈజీఎస్ ఏపీవో జాదవ్ శ్రీనివాస్ తదితరులున్నారు.



మర్కగూడ అంగన్‌వాడీ కేంద్రంలో వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ రాజర్షి షా

వీఆర్‌వో వారసులకు కారుణ్య ఉద్యోగాలు

కైలాస్‌నగర్: రెవెన్యూ శాఖలో వీఆర్‌వోలుగా పనిచేస్తూ మృతి చెందిన వారి వారసులకు సంబంధించిన కారుణ్య నియామకాల కోసం కలెక్టరేట్‌లో శుక్రవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. అదనపు కలెక్టర్ శ్యామలాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌కు 12మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఇందులో ఇద్దరు నాట్ విల్లింగ్ సమర్పించారు. కాగా ఇద్దరికి జూనియర్ అసిస్టెంట్లుగా, ఐదుగురికి ఆఫీస్ సబార్డినేట్లుగా, ఒకరిని మెసెంజర్‌గా, ఇద్దరికి స్వీపర్లుగా ఉద్యోగాలు కల్పించారు. వీరికి కలెక్టర్ రాజర్షిషా త్వరలో పోస్టింగ్ కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేయనున్నారు.



ఉద్యోగాలు పొందిన అభ్యర్థులతో అదనపు కలెక్టర్ శ్యామలాదేవి

పక్కాగా మొక్కల లెక్క

- ప్రతీ మొక్కకు జియోట్యాగింగ్
- వందశాతం సంరక్షణ దిశగా చర్యలు
- ఆచరిస్తే మెరుగుపడనున్న పచ్చదనం
- ఇంకా ముందుకు రాని పలు శాఖలు

కై లాస్‌నగర్: పచ్చదనం పెంపొందించాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వనమహోత్సవ కార్యక్రమాన్ని అమలు చేస్తోంది. కోట్లాది రూపాయలు వెచ్చించి ఆయా శాఖల ఆధ్వర్యంలో ఏటా లక్షలాది మొక్కలను నాటుతోంది. అయితే క్షేత్రస్థాయిలో సిబ్బంది నిర్లక్ష్యం, అధికారుల అలసత్వంతో అవి వృక్షాలుగా ఎదుగడం లేదు. సరైన రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో మూగజీవాలకు ఆహారంగా మారుతుండడంతో పాటు ఎండిపోతున్నాయి. దీంతో సర్కారు సొమ్ము వృథా అవుతుందే తప్ప ఆశించిన ప్రయోజనం నెరవేరడం లేదు. దీన్ని గుర్తించిన కలెక్టర్ రాజర్షి షా నాటిన ప్రతీ మొక్కను సంరక్షించే దిశగా చర్యలకు ఉపక్రమించారు. ప్రతీ మొక్కకు జియోట్యాగింగ్ చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ దిశగా అధికారులు కసరత్తు చేయడంతో మొక్కల లెక్క పక్కాగా తేలడంతో పాటు సంరక్షించేందుకు దోహదపడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతుంది.



మొక్క నాటుతున్న కలెక్టర్ రాజర్షి షా (ఫైల్)

లక్ష్యం 44 లక్షలు.. నాటినవి 39 లక్షలు

కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవంలో భాగంగా 2024–25 సంవత్సరానికి గాను జిల్లా వ్యాప్తంగా 40 ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో 44.17 లక్షల మొక్కలు నాటాలనే లక్ష్యంగా నిర్ణయించారు. గత జూలై నెలాఖరులో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించగా అధికారిక లెక్కల ప్రకారం ఇప్పటి వరకు అన్ని శాఖలు కలిపి 39,38,309 మొక్కలు నాటారు. ఇంకా పది లక్షల మొక్కలు నాటాల్సి ఉంది. అయితే కొన్ని శాఖలు మాత్రం కనీసం వంద మొక్కలు సైతం నాటకపోవడం గమనార్హం.

మొక్క లెక్క తెలిసేలా

నాటిన ప్రతి మొక్క లెక్క పక్కాగా తెలిసేలా జియోట్యాగింగ్‌కు కలెక్టర్ ఆదేశించారు. తదనుగుణంగా పలు శాఖల అధికారులు తమ పరిధిలో నాటిన మొక్కలకు ఈ ప్రక్రియ చేపట్టారు. తద్వారా అధికారులు ఆన్‌లైన్‌లో తమ కార్యాలయాల నుంచే మొక్కల స్థితిగతులను పర్యవేక్షించవచ్చు. అధికారిక లెక్కల ప్రకారం జిల్లాలోని 40 శాఖలకు గాను 15 శాఖల అధికారులు 2,991 ప్రాంతాల్లో 28,89,473 మొక్కలను నాటారు. అందులో 2,190 లొకేషన్స్‌లోని 28,62,237 మొక్కలకు జియోట్యాగింగ్ పూర్తి చేశారు. అత్యధికంగా అటవీశాఖ ఆధ్వర్యంలో 52 లొకేషన్స్‌లో 4,51,169 మొక్కలు నాటగా అందులో 45 లొకేషన్స్‌లోని 4,51,169 మొక్కలకు జియోట్యాగింగ్ పూర్తి చేశారు. అత్యల్పంగా పశుసంవర్ధకశాఖ 45 లొకేషన్స్‌లో 196 మొక్కలు నాటగా అందులో 12లొకేషన్స్‌లోని 160 మొక్కలకు జియోట్యాగింగ్ పూర్తి చేశారు.

ప్రభుత్వశాఖ	నాటిన మొక్కలు	జియోట్యాగింగ్ చేసినవి
మార్కెటింగ్	1,410	1,410
వైద్యారోగ్య	2,635	1,901
మైనార్టీ సంక్షేమ	3,365	3,365
బీసీ సంక్షేమ	1,001	1001
పౌరసరఫరాలు	3,043	316
డ్వామా	18,51,151	18,47,119
దేవాదాయ	2,324	2,032
ఉద్యానవన	19,255	200
పరిశ్రమలు	5,200	5,200
గిరిజన సంక్షేమం	2,965	2,965
పాఠశాల విద్య	5,709	5,349
మున్సిపల్	5,34,050	5,34,050
ఎక్సైజ్	6,000	6,000

క్లుప్తంగా

వాగులో కొట్టుకుపోయి మహిళ మృతి

బోథ్‌: మండల కేంద్రంలోని పెద్దవాగులో వొడ్నాల పోసాని(55) అనే మహిళ బట్టలు ఉతుకుతూ కొట్టుకుపోయి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం... రజక కులానికి చెందిన పోశెట్టి– పోసాని దంపతులు వృత్తి పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. శుక్రవారం పెద్దవాగు బ్రిడ్జి కింది భాగంలో దంపతులిద్దరూ బట్టలు ఉతుకుతున్నారు. ఓ చీర వాగులో కొట్టుకుపోతున్న క్రమంలో పోసాని దానిని పట్టుకునే క్రమంలో లోతు ప్రాంతంలోకి వెళ్లింది. ఈ క్రమంలో కొట్టుకుపోయింది. గమనించిన భర్త ఆమెను కాపాడేందుకు వెళ్లగా అతను కూడా కొట్టుకుపోతున్న క్రమంలో స్థానికులు అతడిని కాపాడారు. పోసాని కొంత దూరంలో బండరాళ్ల మధ్య మృతి చెంది కనిపించింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అనిల్‌ జాదవ్‌ అక్కడికి చేరుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. తక్షణ సాయంగా రూ. 10వేలు అందించారు.

‘కడెం’కు కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

కడెం: కడెం ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. శుక్రవారం ప్రాజెక్టుకు 4,922 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో అధికారులు ఒక గేటు ఎత్తి 4,355 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలారు. ప్రాజెక్టు పూర్తి నీటిమట్టం 700 అడుగులు. ప్రస్తుతం 697.375 అడుగులు ఉంది.

ఎల్‌ఐసీతో పాలసీదారులకు బీమా



మాట్లాడుతున్న ఏఎస్పీ అవినాష్‌కుమార్‌

భైంసాటౌన్‌: ఎల్‌ఐసీతో పాలసీదారులకు బీమా లభిస్తుందని భైంసా ఏఎస్పీ అవినాష్‌కుమార్‌ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ఎల్‌ఐసీ కార్యాలయంలో నిర్వహించిన సంస్థ వార్షికోత్సవంలో పాల్గొని మాట్లాడారు. ఈసందర్భంగా వివిధ పాఠశాలల విద్యార్థులకు క్విజ్‌ పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఏఎస్పీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ జీవిత బీమా చేయించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్రాంచ్‌ మేనేజర్‌ శ్రీనివాస్‌కుమార్‌, డెవలప్‌ ఆఫీసర్స్‌ గంగారెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, శ్రవణ్‌కుమార్‌, సాయినాథ్‌, రవి, ఏజెంట్లు తదితరులు పాల్గొన్నారు.

మట్టి వినాయక @ 66



చెన్నూర్‌ విశ్వకర్మ కాలనీలో మట్టి విగ్రహం తయారు చేస్తూ..

- ఆరున్నర దశాబ్దాలుగా ఏర్పాటు
- నానయ్య పంతులు దూరదృష్టి
- ఉత్సవాలు ముగిసే వరకు భజన
- నిమజ్జనంలో డీజేలు, డప్పు చప్పుళ్లు ఉండవు..



విశ్వ బ్రాహ్మణ గణేశ్‌ మండపం కోసం సిద్ధమవుతున్న మట్టి విగ్రహం

చెన్నూర్‌: ఆరున్నర దశాబ్దాల క్రితం మట్టి వినాయక ప్రతిమ ఏర్పాటుకు బీజం పడింది. ఆ ఆచారం అనాదిగా కొనసాగుతూ వస్తోంది. దూరదృష్టితో ఆలోచించి నానయ్య పంతులు వేసిన మట్టి గణపతి తయారీ పునాది నేటికీ కొనసాగుతోంది. చెన్నూర్‌ పట్టణంలోని విశ్వబ్రాహ్మణులు గత అరవై ఆరేళ్లుగా మట్టి గణపతిని స్వయంగా తయారు చేసి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. 1958 సంవత్సరంలో అకినపల్లి నానయ్య ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న సమయంలో ఆయన మిత్ర బృందం లక్ష్మయ్య, మల్లయ్యలతో కలిసి మట్టి గణపతిని తయారు చేశారు. విశ్వకర్మ కాలనీలో విశ్వకర్మ గణేశ్‌ మండలి పేరుతో నవరాత్రి ఉత్సవాలు ప్రారంభించారు. ఉత్సవాలు పూర్తయ్యే వరకు వరకు ప్రతీరోజు రాత్రి భజన కార్యక్రమం నిర్వహిస్తారు. నిమజ్జన సందర్భంగా నలుగురు వ్యక్తులు విగ్రహాన్ని మోసుకుంటూ వెళ్లి పెద్ద చెరువులో నిమజ్జనం చేసే వారని శంకరయ్య తెలిపారు. నవరాత్రి ఉత్సవాలు ముగిసే వరకు విశ్వ బ్రాహ్మణ గణేశ్‌ మండలి వద్ద భజన మండలి ఆధ్వర్యంలో ప్రతీరోజు భజన చేస్తారు. నిమజ్జనం రోజు డీజేలు, డప్పుచప్పుళ్లు లేకుండా భజన చేస్తూ ఊరేగింపుగా వెళ్లారు.

నాడు పక్షం రోజులు.. నేడు వారం రోజులు

నాడు విగ్రహం తయారు చేసేందుకు పక్షం రోజుల పాటు కష్టపడేవారు. స్వయంగా పొలాల మట్టిని తీసుకొచ్చి నియమ నిష్టాలతో పక్షం రోజులు మద్య, మాంసాహారాలు ముట్టకుండా తయారు చేసేవాళ్లు. ప్రస్తుతం నేటి యువకులు వినయ్‌చారి ఆధ్వర్యంలో వారం రోజుల్లో విగ్రహాన్ని తయారు చేస్తున్నారు.

పెద్దల ఆలోచన అమోఘం..



66 ఏళ్ల క్రితం మా తండ్రి నానయ్య ఉపాధ్యాయుడిగా ఉంటూ ఆనాడు చేసిన ఆలోచనను మా తరంతోపాటు నేటి యువత సైతం పర్యావరణ హితాన్ని దృష్టిలో పెట్టుకొని మట్టి విగ్రహాన్ని తయారు చేయడం సంతోషంగా ఉంది. నేడు పర్యావరణ శాస్త్రవేత్తలు సైతం మట్టి విగ్రహాలు ఏర్పాటు చేసుకోవాలని చెప్పుతున్నా.. కొందరు పెడచెవిన పెడుతున్నారు. ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని అందరూ మట్టి విగ్రహాలు ఏర్పాటు చేయాలి.

– అకినపల్లి సత్యనారాయణ చెన్నూర్‌

పుట్టమన్ను తెచ్చి... ప్రతిమలుగా మలిచి...



పంపిణీకి సిద్ధంగా ఉంచిన వినాయక ప్రతిమలతో నర్సయ్య దంపతులు

నిర్మల్‌ఖిల్లా: అతనో పర్యావరణ ప్రేమికుడు.. రసాయన రంగులు, ప్లాస్టర్‌ ఆఫ్‌ పారిస్‌ మిశ్రమంతో తయారు చేసిన గణేశ్‌ విగ్రహాలతో పర్యావరణానికి హాని కలుగుతుందని భావించి తన వంతు బాధ్యతగా అటవీ ప్రాంతం నుంచి తెచ్చిన పుట్టమన్ను, గోమయం (ఆవు పేడ) కలిపి వినాయక ప్రతిమలు తయారు చేస్తున్నాడు. వీటిని స్థానికులకు ఉచితంగా పంపిణీ చేస్తున్నాడు. స్థానిక బంగల్‌పేట్‌ ప్రాంతానికి చెందిన ‘పాపెన నర్సయ్య’ ప్రకృతి ప్రసాదించిన పుట్టమన్ను, ఆవు పేడతో తయారుచేసిన ప్రతిమలను పూజించడం వల్లనే పర్యావరణానికి మేలు చేసిన వారమవుతామని పేర్కొంటున్నాడు. పదేళ్లుగా హైదరాబాదులోనూ పంపిణీ చేసినట్లు చెబుతున్నాడు. మట్టి గణపతినే ప్రతిఒక్కరూ ప్రతిష్ఠించి, పూజించాలని కోరుతున్నాడు. వినాయ క చవితి పర్వదినం నేపథ్యంలో ఉచితంగా గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తూ, పర్యావరణ స్ఫూర్తిని చాటుతున్న పాపెన నర్సయ్య –విజయలక్ష్మి దంపతులను పలువురు అభినందిస్తున్నారు.



విగ్రహాలను తీర్చిదిద్దుతున్న నర్సయ్య

లైంగికదాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలి



ఆర్డీవోకు వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ మహిళా మోర్చా నాయకులు

నిర్మల్‌చైన్‌గేట్‌: జైనూరులో గిరిజన మహిళపై జరిగిన లైంగికదాడిచేసిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయం ఎదుట శుక్రవారం ఆందోళన చేశారు. మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు రజిని వైద్య మాట్లాడుతూ నిందితుడు ముగ్దూంను ఉరితీయాలన్నారు. ఘటన వెలుగులోకి వచ్చి నాలుగు రోజులవుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని తెలిపారు. బాధితురాకి మెరుగైన వైద్యం అందించాలని డిమాండ్‌ చేశారు. నిరసనలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు అలివేలుమంగ, మహిళా మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సామ భూలక్ష్మి, పట్టణ అధ్యక్షురాలు ఆడెపు లలిత, సభ్యత్వ నమోదు జిల్లా కోకన్వీనర్‌ సుష్మారెడ్డి, జిల్లా కార్యదర్శి లత, అంబేకర్‌ దీప, సుజాత, సారిక తదితరులు పాల్గొన్నారు.

బాలికలపై ఆటో డ్రైవర్‌ లైంగిక వేధింపులు?

నిర్మల్‌టౌన్‌: నిర్మల్‌ శివారు ప్రాంతంలోని ఇద్దరు బాలికలపై ఓ ఆటోడ్రైవర్‌ లైంగికదాడికి యత్నించాడు. నిజామాబాద్‌కు చెందిన ఇద్దరు బాలికలు యాచన కోసం నిర్మల్‌కు వచ్చారు. స్థానిక శివాజీచౌక్‌ ప్రాంతంలో ఓ ఆటోడ్రైవర్‌ వారికి మాయమాటలు చెప్పి తన ఆటోలో ఎక్కించుకున్నాడు. పట్టణ శివారు ప్రాంతానికి తీసుకువెళ్లి, వారిపై లైంగిక వేధింపులకు ప్రయత్నించాడు. గమనించినస్థానికులు ఆటోడ్రైవర్‌ను పట్టుకుని పోలీసులకు అప్పగించారు. ఈ విషయమై పట్టణ పోలీసులను సంప్రదించగా.. ఘటనపై కేసు నమోదు చేశామని తెలిపారు.

పెద్దమనసు చాటుకున్న చిన్నారి



పొదుపు డబ్బా పగులగొడుతున్న చిన్నారి



Transfer Details
Message
B.Shanvika 1st class Nirmal ?????? ??????? ??????
Transaction ID
T2409061558225244202176
Debited from
Shanu Thai v... ₹2,000
UTR: 425033345706

ఫోన్‌పే ద్వారా పంపిన రిసిప్ట్‌

ఖానాపూర్‌:వరదబాధితుల సహాయార్థం సీఎం సహాయ నిధికి మండలంలోని గోసంపల్లె గ్రామానికి చెందిన చిన్నారి శాన్విక నేనుసైతం అంటూ చేయూత నిచ్చింది. గ్రామానికి చెందిన సోని–శివరామకృష్ణ దంపతుల కూతురు శాన్విక పొదుపు డబ్బాలో జమచేసిన రూ.3,500 నుంచి రూ.2 వేలు తెలంగాణ సీఎం సహాయనిధికి, రూ.1,500 ఆంధ్రప్రదేశ్‌ సెక్రెటేరియట్‌కు ఫోన్‌పే ద్వారా పంపింపించింది.

తృటిలో తప్పిన ప్రమాదం



అదుపు తప్పిన జీపు

కడెం: మండలంలోని అల్లంపల్లి జీపీ పరిధిలోని అద్దాల తిమ్మాపూర్‌ గ్రామానికి వెళ్లే జీపు శుక్రవారం అదుపుతప్పి పక్కనే ఉన్న నీటికుంటలోకి దూసుకెళ్లింది. ఉట్నూర్‌ నుంచి 12మంది ప్రయాణికులతో బయలుదేరిన జీపు అల్లంపల్లి దారిలో రోడ్డుపై నుంచి అదుపుతప్పి కుంటలోకి వెళ్లి ఆగిపోయింది. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది.మారుమూల అటవీ ప్రాంతంలోని అల్లంపల్లి ఉమ్మడి జీపీలో పదికిపైగా గ్రామలుంటాయి. వీరు నిత్యంమండల కేంద్రంతోపాటుగా, ఉట్నూర్‌, జన్నారం తదితర ప్రాంతాలకు వెళ్లాలంటే పక్కా రోడ్డు లేదు. వర్షాకాలంలో రాకపోకలు సాగించాలంటే నరకయాతనే. ప్రమాదకర వాగులు, వంకలు దాటుకుంటు రాకపోకలు సాగిస్తుంటారు. అత్యవసర సమయంలో అంబులెన్స్‌లు రాక ప్రాణాలు పోయిన సంఘటనలూ ఉన్నాయి.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి

కుంటాల: మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన సాంబార్‌ ఎంకవ్వ(94) రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. కుంటాల ఎస్సై భాస్కరాచారి కథనం ప్రకారం.. ఎంకవ్వ గురువారం రాత్రి కల్లూరులో 61 జాతీయ రహదారి దాటి కాలకృత్యాలు తీర్చుకునేందుకు వెళ్లింది. కల్లూరులో కిరాణా దుకాణంలో సరుకులు దింపేందుకు బొలెరో వాహనం భైంసా నుంచి వచ్చింది. అతివేగం, రాంగ్‌రూట్‌లో వచ్చిన డ్రైవర్‌ గమనించక వృద్ధురాలిని ఢీకొట్టాడు. తీవ్రంగా గాయపడిన ఎంకవ్వను 108లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందింది. మృతురాలి మనుమడు సంపత్‌ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

మతిస్థిమితం లేని యువతిపై అఘాయిత్యం

- గర్భం దాల్చడంతో విషయం వెలుగులోకి
- కడుపులోనే పిండం మృతి.. తొలగించిన వైద్యులు

కడెం: మండలంలోని ధర్మాజీపేట్‌కు చెందిన మతిస్థిమితం లేని యువతిపై గుర్తుతెలియని వ్యక్తులు అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఆమె గర్భందాల్చి అస్వస్థతకు గురికావడంతో కుటుంబసభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లడంతో విషయం వెలుగులోకి వచ్చింది. వైద్య పరీక్షలు చేసన డాక్టర్లు... యువతి కడుపులో మృత పిండం ఉన్నట్లు గుర్తించారు. వెంటనే బయటకు తీశారు. లేదంటే యువతి ప్రాణాలకు ముప్పు జరిగేదని తెలిపారు. కుటుంబ సభ్యులు ఇటీవలే ఆ పిండాన్ని గ్రామసమీపంలో పూడ్చిపెట్టారు. విషయం పోలీసులకు తెలియడంతో శుక్రవారం గ్రామానికి చేరుకున్నారు. పూడ్చిన ప్రాంతాన్ని తవ్వించి పిండం బయటకు తీయించారు. శాంపిల్స్‌ సేకరించి, కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం.

విద్యుదాఘాతంతో రైతుకూలీ మృతి

- పంట రక్షణ కోసం ఏర్పాటు చేసిన కరెంటు తీగ తగిలి మృత్యువాత



పంట చేలో గంగారాం మృతదేహం

బజార్‌హత్నూర్‌: అటవీ జంతువుల నుంచి పంట రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్‌ తీగ ఓ రైతు కూలీ ప్రాణం తీసింది. ఆదిలాబాద్‌ జిల్లా బజార్‌హత్నూర్‌ మండలంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఎస్సై అప్పారావ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మాడగూడ గ్రామానికి చెందిన కొడప గంగారాం(45) గురువారం సాయంత్రం ఓ రైతు చేనులో పనులకు వెళ్లి తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం కుటుంబ సభ్యులు పంట చేల వద్ద వెదికారు. ఈ క్రమంలో చిక్రం లక్ష్మణ్‌ చేనులో అడవి జంతువుల నుంచి రక్షణ కోసం ఏర్పాటు చేసిన విద్యుత్‌ తీగకు తగిలి మృతి చెంది విగత జీవిగా కనిపించాడు. గంగారాం పనికి వెళ్లి వచ్చే క్రమంలో లక్ష్మణ్‌ చేనులో ఉన్న విద్యుత్‌ తీగకు తగిలినట్లుగా భావిస్తున్నారు. మృతుడి భార్య తులసీబాయి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

డబ్బుల కోసం వేధిస్తున్నాడని ఆత్మహత్య



అంకం పెద్ద రాజన్న (ఫైల్‌)

సోన్‌: మధ్యవర్తిగా ఉన్నందుకు డబ్బుల కోసం తనను వేధిస్తున్నాడని మనస్తాపం చెందిన ఓ వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన సోన్‌ మండలం కడ్తాల్‌లో శుక్రవారం జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం..పాక్‌పట్ల గ్రామానికి చెందిన మహేశ్‌ నుంచి షబ్బీర్‌ అనే వ్యక్తి మూడు నెలల క్రితం గొర్రెలు కొనుగోలు చేశాడు. ఈ సమయంలో కడ్తాల్‌ గ్రామానికి చెందిన అంకం పెద్ద రాజన్న (60) మధ్యవర్తిగా ఉన్నాడు. మూడు నెలలు గడిచినా షబ్బీర్‌ గొర్రెల డబ్బులను మహేశ్‌కు ఇవ్వలేదు. దీంతో మహేశ్‌ మధ్యవర్తిగా ఉన్న రాజన్నకు నిత్యం ఫోన్‌చేసి ఒత్తిడి చేశాడు. దీంతో మనస్తాపం చెందిన రాజన్న శుక్రవారం ఇంటి పక్కన ఉన్న రేకుల షెడ్డులో ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు మహేశ్‌, షబ్బీర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోపి తెలిపారు.

వ్యభిచార కేంద్రంపై పోలీసుల దాడి

- ఆరుగురు మహిళలు, ఏడుగురు విటుల అరెస్ట్‌
- గత జూలైలో అదే లాడ్జి యజమాని అరెస్ట్‌



వ్యభిచార ముఠా వివరాలు వెల్లడిస్తున్న సీఐ బన్సిలాల్‌

మంచిర్యాలక్రైం: జూలై 25న స్థానిక ఐబీ చౌరస్తాలోని సాయినాథ్‌ రెసిడెన్సి అండ్‌ లాడ్జిలో లాడ్జి యజమానితోపాటు ఇద్దరు యువకులు, ముగ్గు రు మహిళలు వ్యభిచారం చేస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. జిల్లాలో సంచలనం సృష్టించిన ఈ ఘటన ప్రజలు మరువక ముందే తాజాగా శు క్రవారం అదే లాడ్జిలో వ్యభిచారానికి పాల్పడుతు న్న ఆరుగురు మహిళలు, లాడ్జి నిర్వాహకుడితో పాటు ఏడుగురు విటులను మంచిర్యాల పోలీసులు అరెస్టు చేశారు. లాడ్జి యజమాని జిల్లాలో రా జకీయంగా పేరున్న వ్యక్తి కావడం, రెండు సార్లు అదే లాడ్జిలో దందా సాగిస్తూ పట్టుబడడం చర్చనీయాంశమైంది. గత నెల 21న జిల్లా కేంద్రంలో ని ఎల్‌ఐసీ కార్యాలయం సమీపంలో ఉన్న ఓ గెస్ట్‌హౌస్‌లో ఏడుగురు విటులు, ఓ మహిళను పోలీ సులు అరెస్టు చేశారు. శుక్రవారం సాయినాథ్‌ రెసిడెన్సి అండ్‌ లాడ్జిలో వ్యభిచారం జరుగుతోందని అందిన సమాచారం మేరకు సీఐ బన్సిలాల్‌ సి బ్బందితో ఆకస్మికంగా మెరుపు దాడి చేశారు. ఆ రుగురు మహిళలు, ఆరుగురు పురుషులు వ్యభిచారం చేస్తూ పట్టుబడ్డారని సీఐ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. బెల్లంపల్లి మండలం ఆకెనపెల్లికి చెందిన సుంకరి శివయ్య, గోదావరిఖనికి చెందిన మందాల శివ ఆశీష్‌, ఆకుల ప్రశాంత్‌, రౌతు కార్తీక్‌, లక్సెట్టిపేటకు చెందిన తిరుపతి, పె ద్దపల్లి జిల్లా వెల్గటూర్‌కు చెందిన గోస్కుల ప్రశాంత్‌తోపాటు లాడ్జి నిర్వాహకుడు మోతం జనార్దన్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని తెలిపారు. మహిళలను సఖీ సెంటర్‌కు తరలించామని పేర్కొన్నారు. విటులు లాడ్జి నిర్వాహకుడికి చెల్లించిన రూ.6600 నగదు స్వాధీనం చేసుకున్నామని, వ్యభిచారాన్ని ప్రోత్సహిస్తున్న లాడ్జి యజమాని సిరుపురం శ్రీనివా స్‌ను త్వరలో అరెస్ట్‌ చేస్తామని తెలిపారు.